ఆసుపత్రి ప్రసవాలపై జెడి ఆరా

పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న డాక్టర్ రమేష్

ప్రజాశక్తి -జి. మాడుగుల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యఆరోగ్యశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. పిహెచ్‌సిలో జరుగుతున్న ఆసుపత్రి డెలివరీల వివరాలపై ఆరా తీశారు. తరువాత ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరాన్ని సందర్శించి, వైద్యులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా డిటిసిఒ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, ఎంపిహెచ్ఇఒ నడిగట్ల ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

- సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ సభ్యుల ధ్వజం
- అల్లూరి జిల్లాలో టెన్త్ ఫలితాలు దిగజారడంపై ఆందోళన
- స్కూళ్లను పరిశీలించాలని జెడ్‌పిటిసిలకు చైర్‌పర్సన్ సుభద్ర సూచన
- వాడీవేడిగా జెడ్‌పి సమావేశం

కలెక్టర్లు రాకపోతే సమావేశ బహిష్కరణ

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్లు, ఐటిడిఎ పిఒ రాకపోతే వచ్చే సమావేశాన్ని బాయ్‌కాట్ చేద్దాం. వచ్చేసారి నుంచి సమావేశం నిర్వహించకూడదు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాల్సిన కలెక్టర్లు రాకపోతే సమావేశం నిర్వహించుకోవడం ఎందుకు ? సమావేశానికి రాని కలెక్టర్‌పై ప్రభుత్వానికి ఫిర్యాదుచేస్తా' అని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. జిల్లా పరిషత్ సమావేశానికి కలెక్టర్లు, పిఒ రాకపోవడంపై సభ్యులు మంగళవారం వివిధ సందర్భాల్లో ప్రస్తావించినప్పుడు ఛైర్‌పర్సన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పదో తరగతి ఫలితాల్లో 24వ స్థానంలో వుండడంపై సభ్యులు తీవ్రంగా స్పందించారు. ఫలితాలు రాకపోవడానికిగల కారణాలను గుర్తించి, లోపాలను సరిచేయాలని అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఏజెన్సీలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో పది, ఇంటర్ ఫలితాలు బాగోలేకపోవడంపై జెడ్‌పిటిసిలు ఆవేదన వ్యక్తంచేశారు. విద్యాబోధన మెరుగుపడకపోతే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని అన్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఫలితాలు మెరుగుదేందుకు చర్యలు చేపట్టాలని ఛైర్‌పర్సన్ సుభద్ర విద్యాశాఖాధికారులకు సూచించారు. పాఠశాలల తనిఖీలకు వెళ్లినప్పుడు విద్యార్థుల స్థాయిని పరిశీలించాలన్నారు. కెజిబివిల్లో కెమిస్ట్రీ, ఫిజిక్స్, లెక్కలు బోధించే అధ్యాపకుల్లేక పోవడంతో ఉత్తీర్ణత తగ్గిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఫలితాలు మెరుగుపడేందుకు విద్యా సంవత్సరం ప్రారంభించేనాటికి ఖాళీల్లేకుండా చూడాలన్నారు. వివిధ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలను పరిశీలించాలని జెడ్‌పిటిసిలకు సూచించారు. పాఠశాలల పరిస్థితిని చెబితే వాటిపై చర్చించి ఫలితాలు మెరుగుపడేలా చర్చిద్దామన్నారు.

సమస్యలపై ప్రశ్నిస్తున్న అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ మైదాన ప్రాంతంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో వచ్చిన ఫలితాలు, ఏజెన్సీలోని ఎందుకురావడం లేదని ప్రశ్నించారు. టెన్త్, ఇంటర్‌లలో ఉత్తీర్ణత తగ్గడానికి కారణాలను గుర్తించి సరిచేయాలన్నారు. ఉత్తీర్ణతలో జిల్లా ఎందుకు వెనుకబడింది? టీచర్స్ తక్కువ వున్నారా? ఎందుకు రిజల్ట్ రాలేదో చెప్పండి? అని కొయ్యూరు జెడ్‌పిటిసి నూకరాజు ప్రశ్నించారు. రెండు, మూడు నెలలకు ఒకసారి వార్డెన్లను మార్చడం సరికాదని, ఇకపై సబ్జెక్టు టీచర్లను వార్డెన్లుగా నియమించొద్దని పెదబయలు జెడ్‌పిటిసి జన్నిబాబు అన్నారు. బుచ్చెయ్యపేట జెడ్‌పిటిసి దొండ రాంబాబు మాట్లాడుతూ ఐటిడిఎ పిఒ సమీక్షించి మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. అల్లూరి జిల్లా నుంచి సమావేశానికి ఐఎఎస్ అధికారులు రాకపోతే సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఎవరు పరిష్కరిస్తారన్నారు. దీనిపై ఛైర్‌పర్సన్ తీవ్రంగా స్పందిస్తూ వచ్చే సమావేశానికి పిఒ, మూడు జిల్లాల కలెక్టర్లు రాకపోతే సమావేశం నిర్వహించొద్దన్నారు. అరకు జెడ్‌పిటిసి శెట్టి రోహిణి మాట్లాడుతూ అల్లూరి జిల్లా నుంచి వచ్చే సమావేశానికి కలెక్టర్ రాకపోతే ఏజెన్సీ జెడ్‌పిటిసిలంతా సమావేశం బహిష్కరిస్తామన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులేరాకపోతే సమావేశ ప్రయోజనం ఏంటని అన్నారు. దీనిపై స్పందించిన సుభద్ర.. సమావేశానికి రాని అల్లూరి జిల్లా కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సంపతపురం లే అవుట్ బదులు ఇదే వూర్లోని వేరేచోట లే అవుట్ వేయాలని అనకాపల్లి ఎంపిపి సూరిబాబు, నాడు-నేడు పనుల్లో ఆక్రమణలకు పాల్పడిన అధికారిని విచారణాధికారిగా నియమించడంపై మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట సోమసత్యనారాయణ, ప్రయివేటు విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గొలుగొండ జెడ్‌పిటిసి గిరిబాబు, ఎస్.రాయవరం మండలంలోని పెనుగోలు పిహెచ్‌సిలో టైఫాయిడ్ కిట్స్‌లేవని జెడ్‌పిటిసి కాకర్ల దేవి సమావేశంలో ప్రస్తావించారు. అచ్యుతాపురం జెడ్‌పిటిసి లాలం రాంబాబు (రాము) మాట్లాడుతూ చోడపల్లిలో జగనన్న లే - అవుట్‌లో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొనేలా ఆ స్థలాల్లేవని, వేరే చోట స్థలాలు ఇవ్వాలని అన్నారు. ఎదురువాడ లే అవుట్‌లోకి పట్టాలు పొందిన లబ్ధిదారులను వెళ్లనీయకుండా అడ్డుపడుతున్న అటవీశాఖ తీరు పట్ల అభ్యంతరం చెబుతూ, సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు.

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు : గంగరాజు

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని తీర్మానం చేయాలని సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు అన్నారు. ఏజెన్సీలో చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు వెంటనే చేపట్టడంతోపాటు కొత్తగా చెక్‌డ్యామ్‌లు మంజూరు చేయాలన్నారు. రొంపిల్లి పంచాయతీలో బూరుగ, చినకోనెల, కరకవలస, గూడెం, దబ్బలపాడు గ్రామాలకు విద్యుత్ లైన్లు వేసేందుకు అటవీశాఖ అడ్డంకులను తొలగించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు.

నిర్మాణాలకు ఇసుక సమస్యలేకుండా చూడండి: మంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రభుత్వ నిర్మాణ పనులు, పేదలు కట్టుకొనే ఇళ్లకు ఇసుక సమస్యలేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్లను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశించారు. ఇసుక అవసరాలపై సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకొని, ఆ ప్రకారమే ఎడ్ల బండ్లతో ఇసుక తీసుకెళ్లేలా చూడాలన్నారు.

సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వి.కల్యాణి, విశాఖపట్నం, అనకాపల్లి జాయింట్ కలెక్టర్లు కెఎస్.విశ్వనాథన్, ఎం.జాహ్నవి, జిల్లా పరిషత్ సిఇఒ పి.శ్రీరామమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

6, 7, 8 తేదీల్లో అరకులోయలో ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు

8వ రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహణ

ఔత్సాహిక కళాకారులకు గిరిజన సంఘం ఆహ్వానం

ప్రజాశక్తి- పాడేరు: ఆంధ్ర ఊటీగా పేరు గాంచిన అల్లూరి జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో వచ్చేనెల 6,7,8, తేదీల్లో ప్రతిరోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి గిరిజన మ్యూజియం వేదికగా ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు నిర్వహించనున్నట్లు గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. రాష్ట్ర ఎనిమిదవ మహాసభలను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ గిరిజనసంఘం ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరగనున్నాయి. అ సంబరాలలో అల్లూరి జిల్లాలోని ఔత్సాహికులైన గిరిజన కళాజాతా బృందాలు, కళాకారులందరూ భాగస్వామ్యులు కావాలని గిరిజన సంఘం ఆహ్వానిస్తోందన్నారు.

ఆదివాసీల హక్కులకై పోరాటం, గిరిజన సంస్కృతి పరిరక్షణ, స్వయం పాలనసాధన నినాదంతో గిరిజనుల్లో చైతన్యం నింపేందుకు బృహతరమైన ఈ కార్యక్రమానికి సంకల్పించిందన్నారు. మరుగున పడిపోతున్న గిరిజన సంస్కృతి, సంప్రదాయలు, గిరిజన కళల పరిరక్షణకు ఆదివాసీ గిరిజనుల్లో చైతన్యం మేల్కొలపాలన్న గిరిజన సంఘం నేషనల్ కౌన్సిల్ సభ్యులు అప్పలనరస, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపుమేరకు గిరిజన సంఘం రాష్ట్ర 8వ మహాసభల్లో భాగంగా ఈ ఆదివాసీ సాంస్కృతిక సంబరాల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సంబరాల్లో ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చే ఔత్సాహిక గిరిజన కళాకారులకు జ్ఞాపికలు అందించి సత్కరించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న అల్లూరి జిల్లాలోని గిరిజన సాంస్కృతిక బృందాలు ముందుగా తమ పేర్లను 94917 88043, 94900 27132 ఫోన్‌నెంబర్లకు తెలియజేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ సూచించారు.

కోర్టు స్టేతో రిలే దీక్షల విరమణ

- వైసిపి కార్యాలయానికి భూమి లీజు

శాశ్వతంగా రద్దయ్యేవరకూ పోరాటం : గిరిజన సంఘం

ప్రజాశక్తి పాడేరు: జిల్లాకేంద్రానికి సమీపంలో చింతలవీధి పంచాయతీ నడింవీధి గ్రామంలో వైసిపి కార్యాలయ నిర్మాణానికి గిరిజన చట్టాలకు విరుద్ధంగా రెండు ఎకరాల భూమి లీజును వ్యతిరేకిస్తూ సంఘటనాస్థలం వద్ద గ్రామస్తులు చేస్తున్న రిలేదీక్షలను మంగళవారం తాత్కాలికంగా విరమించారు. వైసిపి కార్యాలయం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించి నిర్మాణాన్ని నిలిపేయాలని ఇచ్చిన స్టేతో పనులు నిలిపేయడంతో దీక్షలను విరమింపజేసినట్లు గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్ సుందరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలిపారు. గిరిజన కుటుంబాలు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న భూమిని వైసిపి కార్యాలయానికి లీజు పద్ధతిన అధికారులు అప్పగించడం చట్ట విరుద్ధమైనదని, ఈ భూమి లీజు రద్దు చేసే వరకు గిరిజన సంఘం గ్రామస్తులతో కలిసి పోరాటం సాగిస్తుందని తెలిపారు. ప్రస్తుతం స్టేతో దీక్షలను తాత్కాలికంగా విరమించాలని, లీజు అనుమతులు శాశ్వతంగా రద్దయ్యే వరకు పోరాటం వీడేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు వి దాసు నడింవీధి గ్రామస్తులు మజ్జి సతీష్, మజ్జి కొండబాబు, మజ్జి పుల్లన్న, మజ్జి బాలన్న, మజ్జికొండబాబు, ఎం మహేష్, రాజు, చిన్న బాబు, నాగ రాజు, కొండబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అనంతబాబు సభకు ఆదివాసీలు వెళ్లొద్దు

- ఆదివాసీ జెఎసి పిలుపు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీ కేంద్రంగా అరాచకాలు కొనసాగిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఈనెల 24న మంగళవారం రంపచోడవరంలో నిర్వహిస్తున్న సభకు ఆదివాసీలు వెళ్ళొద్దని ఆదివాసీ జెఎసి, అల్లూరి జిల్లా కన్వీనర్ రామారావుదొర, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కిల్లు గంగన్న పడాల్ పిలుపునిచ్చారు. ఒక దళిత యువకుడి హత్యకేసులో ప్రధాన నిందితుడిగా జైలుకెళ్ళి బెయిల్ పై వచ్చిన ఎమ్మెల్సీ అనంత బాబును వైసిపి ప్రభుత్వం వెనకేసుకురావడం, ఆయన చేస్తున్న అరాచకాలను సమర్ధించడం విద్దురంగా ఉందన్నారు. అక్రమ మైనింగ్, గంజాయి వ్యాపారాలు, నకిలీ ఎస్‌టి ధ్రువపత్రాలతో ఆదివాసీలకు దక్కాల్సిన రాజకీయ పదవులను సైతం అనుభవిస్తున్న అనంతబాబు ఆటలను ఏజెన్సీలో సాగనివ్వబోమని హెచ్చరించారు.

బోయ/వాల్మీకుల సమస్యపై నిలదీత

ప్రజాశక్తి -అనంతగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో బోయ/ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం ద్వారా గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తుంటే, దీనిపై శాసనసభలో ఎందుకు అభ్యంతరం చెప్పలేదని అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణను సిపిఎంకు చెందిన వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు నిలదీశారు మంగళవారం వేంగడ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆదిలోనే చేదు అనుభవం ఎదురైంది. బిసి ఎ కేటగిరిలో ఉన్న బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలు 40 లక్షలు మందిని ఎస్‌టి జాబితాలో

ఎమ్మెల్యే ఫాల్గుణను ప్రశ్నిస్తున్న సిపిఎం మాజీ సర్పంచ్ కొండలరావు

చేర్చడం వల్ల నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్న కనీస అవగాహనతోనైనా ప్రభుత్వ నిర్ణయాన్ని ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించారు. ఓట్లేసి గెలిపించిన గిరిజనులు తమకు న్యాయం చేస్తారని ఎంతో ఆశగా ఎదురుచూస్తుంటే, వారికి అన్యాయం జరిగే చర్యలకు వంతపాడడం ఎంతవరకు సమంజసమో చెప్పాలని ప్రశ్నించారు. వరుస ప్రశ్నలు, నిలదీతలతో ఉక్కిరిబిక్కిరై కంగుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ వెంటనే తేరుకుని, గిరిజనులకు అన్యాయం జరిగే ఎటువంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోదని తాను విశ్వసిస్తున్నానన్నారు. అదే జరిగితే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పంచాయతీ పరిధిలో బంధవలస, మెట్టవలస, డాలింపుటు, చీడివలస, బంజాడ, గద్యవలస తదితర గ్రామాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.

ఎమ్మెల్సీ అనంతబాబు బహిరంగ సభను

ప్రజాస్వామ్యయుతంగా అడ్డుకుంటాం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి -రంపచోడవరం

దళిత యువకుడి హత్య కేసులో నిందితునిగా ఉంటూ షరతులతో కూడిన బెయిల్‌పై జైలు నుండి బయటకొచ్చిన ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ (అనంతబాబు) ఈ నెల 24న రంపచోడవరంలో నిర్వహించే బహిరంగ సభను ప్రజాస్వామ్యయుతంగా అడ్డుకుంటామని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అనంతబాబు తన మాజీ కారు డ్రైవర్, దళిత యువకుడు సుబ్రహ్మణ్యాన్ని అత్యంత కిరాతకంగా హత్య చేసి డోర్ డెలివరీ చేశారని, అటువంటి హంతకుడు సభలు నిర్వహింటానికి ప్రభుత్వ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఈ బహిరంగ సభకు రావాలని ప్రభుత్వ ఉద్యోగులను, కార్మికులను, డ్వాక్రా మహిళలను, ఉపాధి హామీ కార్మికులను గ్రామ వాలంటీర్ల ద్వారా పిలుస్తున్నారని, ఇది ప్రభుత్వ సభా? రాజకీయ సభా? అని ప్రశ్నించారు. షరతులతో కూడిన బెయిల్‌తో జైలు నుంచి బయటకొచ్చిన అనంతబాబు ఈ మధ్య గిరిజన యువకులను బెదిరిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిని బట్టి చూస్తూ గిరిజన బిడ్డలు ఈ హంతకుడి చేతిలో బలయ్యే ప్రమాదముందని అనుమానం వ్యక్తం చేశారు. అనంతబాబును వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తునట్టు చెప్పిన మాట పూర్తిగా అబద్ధమేనని, హత్యలు చేసే హంతకులకు ఈ ప్రభుత్వం పట్టం కడుతుందని విమర్శించారు. హంతకుడికి సన్మానాలు చేస్తూ సభలు నిర్వహిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఆదివాసీ హక్కుల్ని, చట్టాల్ని నిర్వీర్యం చేయడమే కాకుండా ఈ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదని దోచుకోవడం కోసమే హంతకుడు బహిరంగ సభలు నిర్వహించడటానికి ఆదేశిస్తుందని పేర్కొన్నారు.

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుని ఇంటి వద్ద పోలీసుల కాపలా

రాజవొమ్మంగి : ఎమ్మెల్సీ అనంతబాబు బహిరంగ సభను అడ్డుకుంటామని పలు ఆదివాసీ సంఘాలు, రాజకీయ పార్టీలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఒక్కరోజు ముందుగానే మంగళవారం జడ్డంగి ఎస్సై షరీఫ్, సిబ్బంది లోదొడ్డి సర్పంచ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఇంటికి వెళ్లి మాట్లాడారు. పోలీసులను కాపాలా పెట్టారు. పోలీసుల చర్యలను గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.

లోతా రామారావుతో మాట్లాడుతున్న ఎస్ఐ షరీఫ్

ఆదివాసీలంతా వ్యతిరేకించాలి

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

రాజవొమ్మంగి : ఎమ్మెల్సీ అనంత బాబు రంపచోడవరంలో ఈ నెల 24న నిర్వహించే బహిరంగ సభను గిరిజనులు, ప్రజలు వ్యతిరేకించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని కేశవరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసి సంవత్సరం గడుస్తున్న నేపథ్యంలో ఈ భారీ బహిరంగ సభ జరుపుతున్నారా? అని ప్రశ్నించారు. గిరిజనలు చిన్నచిన్న సమావేశాలు నిర్వహించుకునే క్రమంలో ఎన్నో ఆంక్షలు పెట్టే అధికారులు ఒక హంతకుడి బహిరంగ సభకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. బహిరంగ సభకు సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా జన సమీకరణ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అవుతుందని పేర్కొన్నారు. బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్న ఆదివాసీలను తప్పుదోవ పట్టించేందుకే అధికారులు, ప్రభుత్వం హంతకుడిచే సభ నిర్వహిస్తున్నాయని విమర్శించారు. ఒక హంతకుడికి ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వం కొమ్ము కాయడం సమంజసం కాదని, ఊరేగింపులు, సన్మానాలు చేసి వత్తాసు పలకడం ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు పి చిన్నారావు, ఎం రమేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -సీలేరు

విద్యుత్ ఉద్యోగులు కో-ఆపరేటివ్ సొసైటీకు ఈనెల 26న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సీలేరు కాంప్లెక్స్‌లో మంగళవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. గాజువాక విద్యుత్ ఉద్యోగుల కో-ఆపరేటివ్ సొసైటీ ప్యానెల్ పదవి కాలం ముగియడంతో కొత్త ప్యానెల్ కోసం ఈనెల 26న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలు కోసం ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రిక్ సిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) తరపున పోటీ చేస్తున్న ప్యానల్‌కు మద్దతుగా ఏపీ ఈఈ జెన్కో రాష్ట్ర కార్యనిర్వాహన అధ్యక్షుడు వై.సత్తిబాబు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగానే సీరియల్ కాంప్లెక్స్‌లోని జల విద్యుత్ కేంద్రాలు ఏపీ జెన్కో కార్యాలయాలు వద్ద విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న వై.సత్తిబాబు తదితరులు

ప్రభుత్వ విద్యాలయాల్లో బోధనా సిబ్బందిని నియమించాలి

ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలలో సరిపడా ఉపాధ్యాయులు, అధ్యాపకులను ప్రభుత్వం వెంటనే నియమించాలని ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండ కేంద్రం రేఖపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ కారం లక్ష్మి మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో అన్ని గిరిజన ఆశ్రమం పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను, అధ్యాపకులను నియమించకపోవడంతో ఉత్తీర్ణత పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల విద్య, వారి అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదనడానికి ఇదే ఉదాహరణ అని పేర్కొన్నారు. కేజీబీవీలో ఇంటర్మీడియట్ ప్రవేశ పెట్టినప్పటికీ సరిపడా సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించకపోవడంతో అక్కడ కూడా ఉత్తీర్ణత శాతం పడిపోయి విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్ధకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ విద్యా సంవత్సరంలోనైనా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ, ప్రభుత్వ కాలేజీల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచులు వెట్టి లక్ష్మి, పూనెం సరోజిని, కారం బుచ్చమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి, చిత్రంలో సిపిఎం ప్రజాప్రతినిధులు

టిడిపి మండల అధ్యక్షునిపై

హత్యాయత్నం పిరికిపంద చర్య

ప్రజాశక్తి- విఆర్.పురం

తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కారం సరేష్‌పై హత్యాయత్నం వైసిపి పిరికిపంద చర్య అని జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి విమర్శించారు. టిడిపి నాయకులు ఆచంట శ్రీనివాస్, బురక కన్నారావు ఆధ్వర్యాన మంగళవారం జరిగిన సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ హత్యా రాజకీయాలు, స్మగ్లింగ్ చేయడం, మనుషులను చంపి డోర్ డెలివరీ చేయడం వైసిపి నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. కారం సురేష్‌బాబు ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలో ఉండి పనిచేస్తున్నారని, దానిని చూసి జీర్ణించుకోలేక ఇటువంటి దాడులకు వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వైసిపి నాయకులకు దమ్ముధైర్యం ఉంటే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హితవుపలికారు. ఇటువంటి దాడులు మానుకోకపోతే టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత మీ సంగతి చూస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, ఎంపీటీసీవాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, టిడిపి నాయకులు ముత్యాల రాంబాబు, పెందుర్తి సుదర్శన్‌రావు, బీరక సూర్య ప్రకాష్ రావు, బురక సారయ్య, రేవు సింహాచలం, ముత్యాల శివరాం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి

ఫుడ్ అవుట్‌లెట్ మేనేజర్ కోర్సుల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యాన జిల్లాలోని అరకు వైటిసిలో ఫుడ్ అవుట్ లెట్ మేనేజర్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంబంధిత అధికారి నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ చదువుకున్న యువతీ యువకులు దీనికి అర్హులని, ఐదు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగావకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజన, వసతి ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9491786463 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని శరభన్నపాలెం గ్రామంలో లోకుల గాంధీ జ్ఞాపకార్థం ఫ్రెండ్లీ సమ్మర్ స్పెషల్ మినీ క్రికెట్ టోర్నమెంట్‌ను శరభన్నపాలెం ఎంపీటీసీ లోకుల సోమగాంధీ, సర్పంచ్ కిముడు సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. 4 పంచాయితీల నుండి 12 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు తోడు సంస్థ అధినేత లచే నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు సంపరి చినబాబు, బోడ సంతోష్, రీమల బాబీ, శివ, భరత్, చందు, అశోక్ తెలిపారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

ఉపాధ్యాయులకు బదిలీల తర్వాతే ప్రమోషన్లు కల్పించాలి

ప్రజాశక్తి -పాడేరు :విద్యా శాఖ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు సాధారణ బదిలీల తర్వాతే . గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగంలో ఖాళీ ఉన్న గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులలో అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాగం సూర్యనారాయణ అధికారులను కోరారు. మంగళవారం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సాధారణ బదిలీలకు ముందు ఉద్యోగోన్నతులు కల్పిస్తే ఆయా కేడర్లలో సీనియర్ ఉపాధ్యాయులకు బదిలీలలో అన్యాయం జరుగుతుందన్నారు
ఉపాధ్యాయుల సాధారణ బదిలీలకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ఈనెల 21న శనివారం మార్గదర్శకాలు జారీ చేశారని తెలిపారు. గెజిటెడ్ కేడర్‌లో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ జూనియర్ లెక్చరర్లకు ఐదేళ్లకోసారి, ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్లకోసారి బదిలీ చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో అవకాశముంటే ఈ మేరకు మార్పు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్లకు, ప్రధానోపాధ్యాయులకు ఐదేళ్లకు బదిలీలకు ఉత్తర్వులు జారీ చేశారని, ఇక్కడ గిరిజన సంక్షేమ శాఖకు, పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల్లో వ్యత్యాసం చూపించడం సమంజసం కాదన్నారు. ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, కార్యదర్శి గేదెల శేషగిరిరావు, రాష్ట్ర సంఘ ప్రతినిధులు పలాసి కృష్ణారావు, బావరాజు ఉన్నారు.

పురస్కారాలు అందుకున్న వాలంటీర్లను అభినందిస్తున్న ఎంపిడిఒ

వాలంటీర్లకు అభినందన

ప్రజాశక్తి -హుకుంపేట : ఉత్తమ సేవలతో అవార్డులు అందుకున్న వాలంటీర్లను మంగళవారం స్థానిక ఎంపిడిఒ వెంకటరావు అభినందించారు. హుకుంపేట మండల కేంద్రంలోని సచివాలయానికి చెందిన పాంగి వెంకటరావు, వి రాజారావు సేవా వజ్ర అవార్డులకు కింద చెరో రూ.30 వేల నగదు, కుంబిడి వసంత అనే వాలంటీరు సేవా రత్న కింద రూ.20 వేలు నగదు పురస్కారాలతోపాటు ప్రశంసాపత్రాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఇటీవల అందుకున్న విషయం తెలిసిందే. అవార్డు గ్రహీతలను అభినందించిన ఎంపిడిఒ వెంకటరావు మాట్లాడుతూ, ఒకే సచివాలయంలో పరిధిలో ముగ్గురి సేవా వజ్ర, సేవా రత్న రావడం అభినందనీయమని, ఇలాగే సేవలను కొనసాగించి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా నిబద్ధతతో కృషి చేయాలని సూచించారు.

బకాయి చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి -జి. మాడుగుల : జిల్లాలో జిసిసి మండల స్టాకు పాయింట్లు వద్ద రేషన్ సరుకులు ఎగుమతులు దిగుమతులు చేస్తున్న హమాలీలకు బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి వి పండుబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక స్టాక్‌పాయింట్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలోధర్నా చేపట్టారు. కార్యక్రమంలో బాబురావు, సత్తిబాబు, శ్రీను కార్మికులు పాల్గొన్నారు

ధర్నా చేస్తున్న జిసిసి హమాలీలు

సేవల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షలో కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- పెదబయలు : ప్రజలకు అందించే సేవల్లో నిర్లక్ష్యం చేసినా, వారికి ఎటువంటి ఇబ్బందులకు గురిచేసినా శాఖాపరమైన కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని శాఖలు ఉద్యోగులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.
షెడ్యూల్డ్ ప్రాంతంలోఆదివాసీలతోపాటు ప్రభుత్వానికి చెందిన భూములు ఆక్రమణకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ భాస్కరరావు, ఇతర అధికారులను ఆదేశించారు. జనన ధ్రువీకరణల నమోదు వేగవంతం చేసి, ఈ నెల 30లోగా పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ కేంద్రాల్లో మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆయా పంచాయతీల్లోని పూర్తిసమాచారం పట్ల పూర్తి అవగాహన ఉండాలని, ఏ క్షణంలో, ఎటువంటి సమాచారం అడిగినా లిఖితపూర్వకంగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు సచివాలయం సిబ్బంది ఎవరి దగ్గరైని లంచం అడిగినట్లు తన దృష్టికి వస్తే కోర్టుకు వెళ్లినా అప్పీలుకు వీలులేకుండా ఉద్యోగం నుంచి తొలగించక తప్పదని ఘాటుగా హెచ్చరించారు. పిల్లల జనన ధ్రువీకరణకు నమోదుకు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ వసతి గృహాల్లో అవకాశం ఉంటుందని, సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా21 రోజుల్లో నమోదు పూర్తిచేయాలని సుమారు 1200 మంది సచివాలయ కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు ప్రస్తుతం వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆధార్, జనన ధ్రువీకరణలు ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులన్న విషయాన్ని గిరిజనులకు తెలియజెప్పి, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జారీకి చర్యలు చేపట్టాలన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణల కోసం ఎవరి నుంచీ డబ్బులు అడగరాదని సూచించారు. గ్రామాల్లో వాలంటీర్లు సాయం తీసుకుని ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వాలంటీర్లు సహకరించకపోతే వెంటనే తనకు తెలియజేయాలన్నారు. ఎవరి మండలాల్లో వారే ఆధార్ నమోదు, సవరణలకు వీలుగా అవసరమైనన్ని కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని సూచించారు. గిరిజనుల భూముల మ్యుటేషన్‌కు నోటరీ

మండల పరిషత్ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అవసరం లేదని, తమ పనుల కోసం ప్రజలు నేరుగా అధికారులను సంప్రదించాలేగాని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. పెదబయలు మండలంలో పాఠశాల భవన నిర్మాణానికి మంజూరైన నిధులు రూ.8లక్షలను ఒక ఉపాధ్యాయుడు దుర్వినియోగం చేశారని, అతనిపై కఠినచర్యలు ఉంటాయన్నారు. జనని సురక్ష, రైతుభరోసా కోసం ఎంపిడిఒను సంప్రదించాలన్నారు. అనంతరం మండల వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లి ఎఒ శ్రీనివాసరావుతో మాట్లాడారు. రైతు పథకాల అమలుపై ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న నూతన మండల పరిషత్ భవనాన్ని పరిశీలించి, పనులు నిలిచిపోవడానికి కారణాలపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. భవనం పూర్తి చేసేందుకు ఎన్ని నిధులు అవసరమౌతాయో అంచనా ప్రతిపాదనలు వేసి నేరుగా తనకు అందజేయాలని, నిధులు విడుదలైన 45రోజుల్లో పనులు పూర్తిచేసి అప్పగించాలని కాంట్రాక్టర్ బుజ్జికి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై వైస్‌ఎంపిపి కొర్ర రాజాబాబు కలెక్టర్ దృష్టికి తేగా సానుకూలంగా స్పందించి, తగు చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పూర్ణయ్య, తహశీల్దార్ భాస్కరరావు, ఎఒ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ పి మాధవరావు, ఎంపిటిసి బొంజుబాబు ఉన్నారు.

విద్యుత్ ఛార్జీల బాదుడుపై టిడిపి ధర్నా

జి.మాడుగుల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ మంగళవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు శివారు నక్కలపుట్టు సబ్‌స్టేషన్ వద్ద టిడిపి నేతలు ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదేశాలతో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్, టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గంగపూజారి శివకుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు బాదుడేబాదుడు అంటూ సాగదీసిన ముఖ్యమంత్రి జగన్, అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఎనిమిది సార్లు ఛార్జీలను పెంచి వినియోగదారులపై రూ.57వేల కోట్ల మోయలేని భారం వేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొట్టగుల్లి రమేష్‌నాయుడు, బుద్ధ జ్యోతి కిరణ్, బుక్క జగదీష్, డప్పోడి వెంకటరమణ, గండేరి పారిజాతం, కంబడి శివశంకర్ పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్థానిక టిడిపి నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, సీనియర్ నాయకులు కె.సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, ఏ త్రినాధరావు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జి.మాడుగుల : విద్యుత్ ఛార్జీలు పెంపును నిరసిస్తూ స్థానిక సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం టిడిపి నాయకులు ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ఉపాధ్యక్షులు మత్స్యరాస వరహాలరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచుకుంటూ పోతున్న విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టిబాబు , ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

28 నుంచి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - పెదబయలు : మోదకొండమ్మ పండగను పురస్కరించుకుని ఈ నెల 28 నుంచి మూడు రోజులపాటు షటిల్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి సుందరరావు, కోశాధికారి రూడ చిన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు సిహెచ్ భీమసుందరరావు మాస్టారు 63028 04070 సెల్‌నెంబర్లలో సంప్రదించి, తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

చిన్నారులకు డ్యాన్స్ పోటీలు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం చిన్నారులకు డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న 30 మంది చిన్నారులు ఉత్సాహంగా చేసిన నృత్యాలు అలరించాయి. చిన్నారులు భవిష్యత్తులో చదువుతోపాటు డ్యాన్స్, క్రీడ పోటీల్లో కూడా రాణించాలని ఎస్ సునీత సూచించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది కె.సుబ్బారావు పాల్గొన్నారు.

అక్రమంగా నరికేసిన చెట్లను చూపుతోన్న సన్నిబాబు

చెట్లు నరికివేతపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- పెదబయలు : మండలకేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలంలో 50 ఏళ్లుగా ఉన్న యూకలిప్టస్ చెట్లను పాఠశాల యాజమాన్యం, హెచ్ఎం, విద్యాకమిటీ చైర్మన్‌కు తెలియకుండా ఎ టువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నరికేశారని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొండా సన్నిబాబు ఆరోపించారు. పాఠశాల పక్కనే సిహెచ్‌ఎస్ స్కూల్ యాజమాన్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రైవేటు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై, జెడ్‌పిఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న 10 యూకలిప్టస్ చెట్లను.నరికేయడంపై జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని సన్నిబాబు కోరారు.

రోడ్డు సౌకర్యం కల్పించరూ..

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గత్తుం పంచాయతీ, గాలిపాడు గ్రామం రోడ్డును బాగుచేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో గ్రామంలోకి వాహనాలు రాకపోకలకు వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం కోతకుగురై, గత్తుం నుండి గాలిపాడు వరకు రోడ్డు కొట్టుకుపోయిందని, దీంతో బైక్‌లు వెళ్లడానికి కూడా వీలులేనంత అధ్వానస్థితికి చేరుకుందన్నారు. దీంతో నిత్యవసరాలతోపాటు అత్యవసరమైన అనారోగ్య సమస్యలకు ఊరు నుంచి బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడే స్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు, అనారోగ్యపీడితులు, గర్భిణులను కాలినడకన డోలిమోతలతో ఆసుపత్రులకు తీసుకెళ్లే పరిస్థితి ఉందన్నారు. జంగంపుట్టు బల్లిగడ్డ నుంచి గాలిపాడు వరకు రోడ్డు మంజూరు చేయాలని గతవారం 1902 కాల్ సెంటర్‌కు పోన్ చేసి ఫిర్యాదు చేశామని గాలిపాడు గ్రామస్తులు అంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

వర్షాలకు కోతకు గురై అధ్వాన స్థితికి చేరిన రోడ్డు

దీక్షల్లో కూర్చున్న విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం

- ఉక్కు జెఎసి దీక్షల్లో విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పడిన ప్రభుత్వ రంగాన్ని అందరం కలిసి కాపాడుకుందామని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు మంగళవారానికి 782వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. కర్మాగారాన్ని దొడ్డిదారిలో మోడీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోందన్నారు. విశాఖపట్నం మహా నగరంగా మారడంలో ప్రభుత్వరంగ పరిశ్రమలు కీలకపాత్ర పోషించాయన్నారు. లక్షలాది మంది వీటిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులను స్టీల్‌ప్లాంట్‌లోకి రానీయకుండా అడ్డుకుంటామన్నారు. దీక్షల్లో క్యాబ్ యూనియన్ నాయకులు నాయుడు, గోపికృష్ణ, అప్పలరాజు, శివ, శ్రీనివాసు, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

టర్నర్ సత్రం ఖాళీ స్థలాలకు వేలం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని టర్నర్ సత్రం ఖాళీ స్థలాలకు మంగళవారం వేలం నిర్వహించారు. టర్నర్ సత్రం డోర్ నెంబర్ 28-2-32 దక్షిణం వైపుగల (ఆకెళ్ళ బ్లాక్) వాయువ్య భాగం ఖాళీ స్థలాలను 11 సంవత్సరాలకుగాను నెలవారీ అద్దె ప్రాతిపదికన బహిరంగ వేలం వేశారు. 19 మంది ప్రథమ ధరావతు చెల్లించి టెండరులో పాల్గొన్నారు. జాగు దుర్గా ప్రసాద్, నడిమిపల్లి శ్రీరంగ ప్రభాకర్ హెచ్చుపాట పాడారు. బహిరంగ వేలం కార్యక్రమంలో దేవాదాయశాఖ ఉపకమిషనర్ ఎస్.సుజాత, సహాయ కమిషనర్ కె.శిరీష, డిసి కార్యాలయం సూపరింటెండెంట్ విజయకుమార్, టర్నర్ సత్రం కార్యనిర్వహణాధికారి ఎన్.ప్రసన్నలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ వసంతరావు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు రికార్డు ప్రగతి

- 73.73 మిలియన్ టన్నుల రవాణాతో కొత్త చరిత్ర

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

2022-2023 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ 73.73 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసి నూతన చరిత్ర సృష్టించింది. తూర్పు తీరంలో రెండో స్థానంలో నిలిచి తన విశిష్టతను చాటుకుంది. 7 శాతం వృద్ధి సాధించడంతో పాటు విశాఖపట్నం పోర్టు చరిత్రలో అత్యధిక సరుకు రవాణా రికార్డును నెలకొల్పింది. ఈ మేరకు మంగళవారం పోర్టు తాజా నివేదికను వెల్లడించింది. వైజాగ్ పోర్టు ఈ ఏడాది స్టీమ్‌కోల్, క్రూడ్ ఆయిల్, కుకింగ్ కోల్, ఎరువుల సరుకు రవాణాలో వృద్ధి నమోదు చేసింది. ట్రాఫిక్ విభాగానికి సంబంధించి గత ఏడాది సెప్టెంబర్ 25న వెస్ట్ క్యూ 1 బెర్త్‌లో ఫెర్రో మాంగనీస్ స్లాగ్‌ను ఎంవిఎస్‌జె స్టార్ నౌక నుంచి పోర్టులో దించారు. అక్టోబర్ 16న ఈస్ట్ క్యూ 7 బెర్త్ నుంచి హై కార్బన్ ఫెర్రో మాంగనీస్‌ను ఎంవి ఆలమ్ సయాంగ్ నౌకలోకి ఎక్కించారు. అలాగే డిసెంబర్ 2022 నుంచి బేబీ కేప్ (260 మీటర్ల పొడవు, 43 మీటర్ల వెడల్పు) వెస్సెల్స్ ఇన్ హార్బర్‌లోకి వచ్చే విధంగా ఆధునికీకరణ పనులు చేపట్టారు. రూ.151 కోట్లతో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. పోర్టును లాండ్ లార్డ్ పోర్టును చేయడంలో భాగంగా రూ.655 కోట్ల విలువైన మూడు పిపిపి ప్రాజెక్టు పనులను అప్పగించారు. మరో రెండు ప్రాజెక్టులు అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉన్నాయి. ఇంకా పలు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

రెజ్లర్ల పోరాటానికి అండగా ఉంటాం

విశాఖలో మహిళా సంఘాల కొవ్వొత్తుల ప్రదర్శన
ఎల్‌ఐసి కార్యాలయం వద్ద మహిళా ఉద్యోగుల ధర్నా
బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్

తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధాని ఢిల్లీలో కొద్ది రోజులుగా రెజ్లర్లు చేపడుతున్న పోరాటానికి మద్దతుగా విశాఖలో మంగళవారం పలుచోట్ల సంఘీభావ కార్యక్రమాలు జరిగాయి. రెజ్లర్లకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని సంఘాల నాయకులు తెలిపారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణం అరెస్ట్ చేయాలని, పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం జిల్లా మహిళా సంఘాల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఐద్వా, మహిళా సమాఖ్య, పిఒడబ్ల్యు, సిఎంఎస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.విమల, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బి.వెంకటలక్ష్మి, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు డి.లలిత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి పి.లక్ష్మి మాట్లాడారు. రెజ్లర్లపై బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదు ఇచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. విచారణ కమిటీ నివేదికను నేటికీ బయట పెట్టకపోవడం దారుణమన్నారు. పని స్థలాలలో లైంగిక వేధింపులకు పాల్పడేవారిని రక్షించడానికి పూనుకున్నట్టుగా కేంద్ర వైఖరి ఉందన్నారు. బ్రిజ్‌భూషణ్‌పై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయని, అయోధ్య బాబ్రీ మసీదును ధ్వంసం చేసిన దుండగుల్లో మొదటి వరుసలో ఆయన ఉన్నాడని, అనేక హత్య కేసులు, లైంగిక దాడులకు పాల్పడిన కేసుల్లో క్రిమినల్ అని గుర్తుచేశారు. అలాంటివాడికి బిజెపి టికెట్ ఇవ్వడమే కాకుండా రెజ్లర్ల సమాఖ్యకు జాతీయ అధ్యక్షునిగా నియమించిందన్నారు. తాను ఏం చేసినా తననెవరూ ఏమీ చేయలేరన్న ధైర్యంతోనే రెజ్లర్లపై అతడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని తెలిపారు. బ్రిజ్ భూషణ్‌ను

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న మహిళా నేతలు

ప్రభుత్వం అరెస్టు చేయకపోగా, ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై భౌతిక దాడులకు పాల్పడటం మరింత దుర్మార్గమన్నారు. అతనిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎల్‌ఐసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన..

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎల్‌ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద ఎల్‌ఐసి ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ డివిజన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎల్‌ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు కూడా దీనిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ జనవరిలోనే బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ తీరుపై మహిళా రెజ్లర్లు ఆందోళనకు దిగారన్నారు. దీనిపై కమిటీ వేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారన్నారు. ఐదు నెలలు గడిచినా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంతో మళ్లీ రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద ధర్నా ప్రారంభించారన్నారు. వారికి పలువురు అంతర్జాతీయ ఒలింపియన్లు, క్రీడాకారులు సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. రెజ్లర్లు పతకాలు సాధించినప్పుడు తమ ఇంటికి ఆహ్వానించిన ప్రధాని ఇప్పుడు వారి సమస్యలను ఉపేక్షిస్తున్నారని విమర్శించారు. వారి నిరసనను బలహీన పర్చడానికి పలు కుట్రలు సాగిస్తున్నారన్నారు. అసభ్యంగా ప్రవర్తించిన హర్యానా బిజెపి మంత్రి సందీప్ సింగ్‌ను కూడా తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐసిఇయు అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, ఎపి స్టేట్ వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ జి.సూర్యప్రభ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళా ఉద్యోగులు

ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యాన..

ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీతల్ మదన్ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహిళా రెజ్లర్లకు మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ గాజువాక ఇన్‌చార్జి కాళ్ల లోకనాథం, స్టేట్ జాయింట్ సెక్రటరీ నిమ్మకాయల భాస్కరరావు, జిల్లా ప్రెసిడెంట్ ఇ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విశాఖ నగర వైభవాన్ని మరింత పెంచండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర వైభవాన్ని మరింత పెంచేలా కృషి చేయాలని గ్రేటర్ విశాఖ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు వైసిపి రీజనల్ కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి దిశానిర్దేశం చేశారు. జివిఎంసి కార్పొరేటర్లతో పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసి వారితో మమేకమవ్వాలని హితబోధ చేశారు. అవినీతికి తావివ్వకుండా ప్రజా సేవలో వుండాలని సూచించారు. ఎవరెవరు ఏం చేస్తున్నారో, ఎవరి వార్డులో ఏం జరుగుతుందో తనకు పూర్తి సమాచారం వుందని స్పష్టం చేశారు. కొంతమంది పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు.

తునికాకు కార్మికులకు పేమెంట్లు చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో తునికాకు సేకరిస్తున్న కార్మికులకు వెంటనే పేమెంట్లను చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుమారు 20 రోజులకు పైగా తునికాకు సేకరించిన కార్మికులకు ఇప్పటికీ పేమెంట్లు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏయే కల్లాల్లో కార్మికులు ఆకులు సేకరించారో వారికి పేమెంట్లు సత్వరమే చేయాలని కోరారు. అలాగే పెద్దమట్టపల్లి నుండి నరసింగపేట వరకు రహదారి నిర్మాణం కోసం ఉన్న రోడ్డును తవ్వి వదిలేశారని, సంవత్సరాలు గడిచినా ఈ రహదారిని నిర్మించకపోవడంతో గోతులు గోతులుగా ఏర్పడి ఆ రోడ్డులో వెళ్లాలంటే గిరిజనులు, ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పెద్దమట్టపల్లి నరసింపేట రోడ్డును వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం నాయకులు కుంజ నాగిరెడ్డి, పంకు సత్తిబాబు, గుండెపుడి లక్ష్మణరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పశువులు మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వట్టిగడ్డ గ్రామం వద్ద 516ఈ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రెండు పశువులు మృతి చెందాయి. వట్టిగెడ్డ గ్రామంలోని పల్లి సత్యనారాయణకు చెందిన ఆవును, కెలేల సత్యనారాయణకు చెందిన ఎద్దును మంగళవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు పశువుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. 516ఈ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా అతివేగంగా టిప్పర్లు తిరుగుతున్నాయని, ఆ వాహనాల వల్లే తమ పశువులు మృత్యువాత పడ్డాయని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. మూడేళ్ల నుంచి పశువులను పెంచుకుంటున్నామని, అవి చనిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో రహదారి నిర్మాణ నిమిత్తం టిప్పర్లు తిరుగుతున్నాయని, రైతులు తమ పశువులు రోడ్డుపైకి వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకోవాలని అధికారులు కోరారు.

కెకె లైన్‌లో భారీగా రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్ కొత్తవలస - కిరండూల్ (కెకె) లైన్‌లోని శృంగవరపుకోట - బొడ్డవర స్టేషన్ల మధ్య డబ్లింగ్‌కు సంబంధించి నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్ళను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. 18514 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25 నుంచి 29 వరకు, 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 26 నుంచి 30 వరకూ రద్దు చేశారు. 08551 విశాఖపట్నం-కిరండూల్ ప్రత్యేక ప్యాసింజర్, 08528 విశాఖపట్నం-రాయ్‌పూర్ ప్రత్యేక ప్యాసింజర్, 08546 విశాఖపట్నం-కోరాపుట్ ప్రత్యేక ప్యాసింజర్ రైళ్ళను ఈ నెల 26 నుంచి మే 29 వరకూ రద్దు చేశారు. 08552 కిరండూల్-విశాఖపట్నం ప్రత్యేక ప్యాసింజర్, 08545 కోరాపుట్-విశాఖపట్నం ప్రత్యేక ప్యాసింజర్, 08527 రాయ్‌పూర్-విశాఖపట్నం ప్రత్యేక ప్యాసింజర్ రైళ్ళను ఈ నెల 27 నుంచి 30 వరకు రద్దు చేశారు. 18512 విశాఖపట్నం-కోరాపుట్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 26, 29 తేదీల్లోనూ, 18511 కోరాపుట్-విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను 27, 30 తేదీల్లోనూ రద్దు చేశారు.

అవగాహనతోనే స్కిజో ఫ్రినియా నివారణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్కిజో ఫ్రినియా అనేది మానసిక వ్యాధి అని, దీనిని చికిత్స ద్వారా నయం చేయవచ్చునని ఓం ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ ఎన్ఎల్.శంకర్ శాస్త్రి, సుస్మిత గాజుల వెల్లడించారు. ఎంవిపి.కాలనీ సెక్టార్ -1లోగల ఓం ఆస్పత్రిలో ఈ నెల 24 ప్రపంచ స్కిజో ఫ్రినియా డేను పురస్కరించుకుని మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ వ్యాధిగ్రస్తులు వెంటనే మానసిక వైద్యునిచే చికిత్స తీసుకోవాలని సూచించారు. వీరిలో ఎక్కువగా నెగటివ్ లక్షణాలు ఉంటాయన్నారు. వీరు ఎక్కువగా ఒంటరిగా ఉండడం, నలుగురిలో కలవక పోవడం, అందరూ తన గురించే మాట్లాడుతున్నారని అనుకోవడం చేస్తుంటారన్నారు. ఈ నెల 24న తమ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల వారు 9885447788 నెంబర్‌కి ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. శిబిరాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.